శిథిలావస్థలో ఎంపీడీఓ భవనం!


మండల పరిషత్ కార్యాలయం


కార్యాలయ గోడపై పెరిగిన నాచు


బీటలు వారిన ఎంపీఓ గది పైకప్పు

- చిన్నపాటి వర్షానికి కురుస్తున్న గదులు
- పలు చోట్ల భవనానికి బీటలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సిబ్బంది, ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

యాలాల: మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థలోకి చేరింది. చిన్నపాటి వర్షానికి గదులు కురుస్తుండడంతో పాటు పలు చోట్లా భవనం బీటలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆయా గదుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, రోజువారీ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయం గురించి పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పుకుంటున్న అధికారులు ఇలాంటి భవనాలను ఎందుకు మరమ్మతులు చేయించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాచుపట్టిన గోడలు..

మండల పరిషత్ కార్యాలయంలోకి ప్రవేశించిన వెంటనే నాచుపట్టిన గోడలు, తడిసిన పిల్లర్లు దర్శనమిస్తాయి. కార్యాలయ భవనంతో పాటు ఇక్కడ కనీస సౌకర్యాలు, వసతులు లేకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి పింఛన్లు, ప్రజా పాలన ఫిర్యాదుల కోసం వచ్చే వారికి కనీసం మంచినీళ్లు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముళ్లపొదలు, కంపచెట్లతో..

మండల పరిషత్ కార్యాలయ భవనం వెనుకాల స్త్రీశక్తి భవనం, మండల పరిషత్ సమావేశ హాలు ఉంది. ఈ భవనాలు ఉన్న ప్రాంతంలో ముళ్ల పొదలు, కంపచెట్లతో అపరిశుభ్రంగా తయారైంది. స్త్రీ శక్తి భవనంలో ఈజీఎస్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు, ప్రజావాణి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆయా సమావేశాలకు హాజరయ్యే అధికారులకు కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత భవనాలను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

లైసెన్స్ రద్దుకు సిఫారసు

సాక్షి ఎఫెక్ట్..

బంట్వారం: గర్భిణికి కుళ్లిన కోడిగుడ్లు అనే శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ మర్పల్లి సీడీపీఓ ప్రవీణ స్పందించారు. బంట్వారం మండలంలోని యాచారం అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు ఇవ్వడాన్ని తాము సీరియస్‌గా తీసుకున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దుకు సిఫారస్ చేస్తామన్నారు. అతనిపై గతంలో కూడా చాలా ఫిర్యాదులు రావడంతో బిల్లుల చెల్లింపులో కోతలు విధించామని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆయన తీరు మారకపోవ డంతో లైసెన్స్ రద్దు చేయనున్నట్లు తెలిపారు.

పట్టుదలతో చదువుకోవాలి


మాట్లాడుతున్న నోడల్ అధికారి

దౌల్తాబాద్: విద్యార్థులు పట్టుదలతో చదువుకొని, కళాశాలకు, తల్లిదండ్రులకు కీర్తి తీసుకరావాలని జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత విజయాలను సాధించారన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు, ప్రిన్సిపాల్ వసంత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి బాధాకరం


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని రామస్‌కుంట తండాకు చెందిన నెనావత్ హరీశ్ మృతి బాధాకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..రెండు రోజుల క్రితం ఐఐటీ కోసం వారణాసికి వెళ్లిన హరీశ్ అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు. మంగళవారం మండల కేంద్రంలో హరీశ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ చౌరస్తాలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ విషయంలో బాధితా కుటుంబాన్ని ఆదుకునేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వీరన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, నరేందర్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి

దోమ: కొండాయపల్లి గ్రామంలో ఈ నెల 28వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పరిగి తాలుకా ప్రచార కార్యదర్శి గార్లపల్లి మల్లన్న మంగళవాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ అందరి వాడని ప్రజలంతా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

నవాబుపేట: కులుమామిడి గ్రామానికి చెందిన సోమన్నోళ్ల మాణిక్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంగళవారం అనారోగ్యంతో స్వగ్రామంలో మృతిచెందారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో పని చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని మండల నాయకులు పేర్కొన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం పులుమామిడి గ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మొయినాబాద్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఎస్ఐ శంకరయ్య అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలను వేగంగా నడపకుండా నియంత్రణ పాటించాలన్నారు. అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. వాహనాలు వేగంగా నడిపినా, రోడ్లపై పార్కు చేసినా, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపినా ఛలాన్లు పడతాయన్నారు. వాహనాలపై ఉన్న ఛలాన్లను ఎప్పటికప్పుడూ చెల్లించాలన్నారు. తనిఖీలు చేసిన వారిలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు కుల్కచర్లలో వైద్య శిబిరం

కుల్కచర్ల: మండల కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వస్థ్ నారీ స్వశక్తపరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహించనున్నారు. అబ్స్ట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్, ఫర్టిలిటీ సమస్యలు, ఎనిమియా, థైరాయిడ్, బ్రెస్ట్ క్యాన్సర్, రుతుక్రమ సమస్యలకు చికిత్సలు నిర్వహించబడతాయని వివరించారు. రోగులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

కొడంగల్ రూరల్: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వాతావరణంలోని స్ట్రాటో ఆవరణలో గల నీలి రంగులో ఉండే పొరే 'ఓజోన్' అని తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఓజోన్ పొర, పర్యావరణ పరిరక్షణల ప్రాముఖ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాధ్యతగా వ్యవహరిస్తూ పర్యావరణ స్పృహ కలిగి ఉండాలన్నారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లలో వాడే క్లోరోఫ్లోరో కార్బన్‌కు బదులుగా హైడ్రోఫ్లోరో, హైడ్రోఫ్లోరోఈథర్లు వంటి సురక్షిత రసాయనాలు వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపకులు ఎం.హరిప్రియ, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, అధ్యాపక సిబ్బంది టి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, డా.వి.శ్రీధర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులు

బషీరాబాద్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు హిందీ ప్రాముఖ్యతను తెలియజేసేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హిందీ బోధించే ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిల మాట్లాడుతూ.. భారత జాతీయ ఉద్యమంలో దేశాన్ని జాగృతం చేయడంలో ఆ భాష ఎంతగానో ఉపయోగపడిందన్నారు. జాతీయ భాషగా ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీజీటీలు లక్ష్మీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, గోపాలక్రిష్ణ, నర్సింహా, స్వామినాథ్, రజినీ, అస్రనాస్, టీజీటీలు సంతోశ్, అనురాధ, నగేష్, హరీష్, రేణుక, రాజశ్రీ, శశికళ, కంప్యూటర్ ఆపరేటర్ చంద్రశేఖర్, పీఈటీ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన సంబరాలు


మాట్లాడుతున్న రమేశ్ కుమార్

- నేటి నుంచి 22వ తేదీ వరకు పలు సేవా కార్యక్రమాలు

తాండూరు టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నేటి నుంచి 22వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో వారం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు, పార్టీలకతీతంగా పాల్గొనాలని కోరారు. అనంతరం పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం మాట్లాడుతూ ప్రధాని జన్మదినం సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అల్పాహార పంపిణీ, 7.45 గంటలకు స్థానిక కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. 9గంటలకు గంజ్‌లో తెలంగాణ విమోచనా దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. 19న ఉదయం 11 గంటలకు మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, 20న జిమ్‌పార్క్‌లో మాకే నామ్ పే ఏక్ పేడ్, 21న ఉదయం 7గంటలకు స్థానిక ఇందిరాచౌక్ నుంచి ఖాంజాపూర్ గేట్ వరకు నమో మారథాన్ పేరిట 3కె రన్, 22న స్వచ్ఛ భారత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు సాహు శ్రీలత, రజినీ కాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పని యూరియా కష్టాలు


దోమ: ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

- ఆగ్రోస్ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు
- టోకెన్ల ద్వారా పంపిణీ
- సరిపడ లభించక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

దోమ: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఒక్క బస్తా కోసం క్యూలో నిలబడినా అందని పరిస్థితి నెలకొంటొంది. మంగళవారం దోమ మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రానికి ఓ లారీ యూరియా లోడ్ వచ్చింది. ఈ విషయం తెలుసుకుని ఉదయం నాలుగు గంటల నుంచే పెద్ద ఎత్తునా బారులు తీరారు. అయితే వచ్చిన స్టాక్‌ను నిర్వాహకులు టోకెన్లద్వారా పంపిణీ చేశారు. కానీ ఎక్కువ సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో కొంత మందికి దొరకలేదు. క్యూలో నిల్చునప్పటికీ తమకు అందలేదని ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంలో తమను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మండలానికి చాలీచాలని యూరియా సరఫరా చేసి ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిపడ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొరత లేకుండా చూడాలి

అనంతగిరి: యూరియా కొరత లేకుండా చూడాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్‌లోని ఏడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఈ విషయంలో స్పందించి ముందస్తుగా కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీరోజు లోడ్ వచ్చేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. తమకు సరిపడేవిధంగా స్టాక్ తెప్పించాలని కోరారు.

మళ్లీ లొల్లి

బంట్వారం: యూరియా లొల్లీ మళ్లీ కొనసాగుతూనే ఉంది. సరిపడా సరఫరా కాకపోవడంతో సొసైటీల వద్ద బారులు తీరుతున్నారు. గంటల తరబడి నిలబడుతునప్పటికీ అందరికీ అందడం లేదు. మంగళవారం బంట్వారం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద టోకెన్ల కోసం క్యూలైన్‌లో నిలబడ్డారు. కొందరికే మాత్రమే ఇవ్వడంతో చాలామంది వెనుదిరిగి పోయారు. ఇంత దరిద్రమైన పరిపాలన ఎప్పుడు చూడలేదని పలువురు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ధారూరు: ధారూరు, నాగారం, కేరెల్లి రైతు వేదికలలో మంగళవారం పంపిణీ చేశారు. ఒక్కో రైతు వేదికకు 225 బస్తాల చొప్పున లోడ్ వచ్చింది. వాటిని ఒకటి చొప్పున పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్లు జారీచేసి ధారూరు పీఏసీఎస్ సిబ్బంది ద్వారా పంపిణీ చేయించారు. కేరెల్లి రైతు వేదికకు 450 సంచులను పంపాల్సి ఉండగా లారీ లోడ్‌ను ఇక్కడే దింపాలని రైతులు పట్టుబట్టారు. చివరకు పోలీసుల జోక్యంతో 225 బస్తాలను దింపి నాగారానికి తరలించారు.


అనంతగిరి: ఏడీఏ కార్యాలయం ఎదుట నిల్చున్న రైతులు


బంట్వారం: సొసైటీ వద్ద పడిగాపులు

తాగునీటికి తిప్పలు!


తాండూరు రూరల్: వడ్డెరబస్తీలో ట్యాంకర్ వద్ద మంచి నీటికోసం నిరీక్షిస్తున్న మహిళలు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: కోటబాసుపల్లి అనుబంధమైన వడ్డెరబస్తీ మల్కాపూర్ గ్రామ సమీపంలో ఉంది. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తమ కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలతో పాటు తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినా పట్టించుకునే వారు లేరు. వడ్డెరబస్తీలో మూడు బోరు మోటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటికి మరింత ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. కాలనీలో నీరు ఎప్పుడు విడుదల చేస్తారోనని బిందెలతో మహిళలు నిరీక్షిస్తున్నారు. మల్కాపూర్ గ్రామంలోని ఓ హోటల్ వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలకు సెలవు పెట్టి మరీ మంచి నీటి కోసం తండ్లాడుతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రావణికి వివరణ కోరగా..ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయిస్తున్నామన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

యాలాల: తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత పేరి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండల కేంద్రంలోని 1, రెండో వార్డు ప్రజలకు బోరుకు పూజచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాగునీటి ఎద్దడి లేకుండా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. దీనికోసం బోరును తవ్వించినట్లు ఆయన వివరించారు. అడిగిన వెంటనే బోరు, మోటారు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించినందుకు రాజేందర్‌రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, నాయకులు మోయిజ్, చందు, మారుతి, మైను, వెంకటయ్యగౌడ్, చంద్రశేఖర్, సుదర్శన్, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ నగర్ వాసుల ఇక్కట్లు ..


యాలాల: బోరును ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

తాండూరు టౌన్: పట్టణంలోని గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగైదు రోజులుగా మున్సిపల్‌లో సక్రమంగా సరఫరా కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. కొంతమంది కొనుగోలు చేసుకుంటున్నారు. ఇంటి పన్ను, నల్లా బిల్లు సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రం తాగేందుకు గుక్కెడు నీరు వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా 20వ వార్డు మాజీ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ మాట్లాడుతూ తాండూరు పట్టణ శివారులోని కాగ్నా నది నుంచి తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. పాత తాండూరులోని పంప్‌హౌజ్ మోటర్లతో పాటు పైపులైన్లను మరమ్మతులు చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు.

వారం రోజులుగా రావడం లేదు

నవాబుపేట: వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని ఎత్ రాజ్ పల్లి గ్రామానికి చెందిన మహిళలు పంచాయతీ కార్యదర్శి నర్సింలును అడ్డుకున్నారు. తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రెండు బోర్లు ఉన్న వాటిని మరమ్మతులు చేయించడం లేదని చెబుతున్నారు. తక్షణమే నీటి సరఫరా చేయాలని లేకుంటే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.


నవాబుపేట: పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న మహిళలు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- సీడీపీఓ ప్రవీణ


మాట్లాడుతున్న ప్రవీణ

మోమిన్‌పేట: ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని సీడీపీఓ ప్రవీణ పేర్కొన్నారు. పోషణ్ బీ- పాడాయి బీ పై శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. మంగళవారం ప్రాజెక్టు పరిధిలోని మోమిన్‌పేట, మర్పల్లి, బంటార్వం, కోట్‌పల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణలో భాగంగా ఆమె మాట్లాడారు. చేతన కార్యక్రమంలో భాగంగా 3 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు రక్షణ, పౌష్టికాహారం అందించడం, ఆరోగ్య విషయాలపై సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అదర్శీలా కార్యక్రమంలో 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆట, పాటలతో విద్య బోధించాలన్నారు. పెరుగుదలలో లోపం ఉన్నవారిని గమనిస్తూ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాలామృతాన్ని పిల్లలకు తినిపించడం వల్ల మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందన్నారు. గర్భిణులు పోషాకాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పలత, రిజ్వానా, ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీడీఓ హిమబిందు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా, రుచికరంగా ఉండేలా కృషి చేయాలని ఎంపీడీఓ హిమబిందు అన్నారు. మండలంలోని రావుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలకు అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం వస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై ఆరా తీశారు. అక్షయపాత్ర నుంచి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.